క్లుప్తంగా

ఘనంగా శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం



వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

భీమునిపట్నం : భీమిలి సమీపంలోని కీతినేపేట వద్దనున్న శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిరాల అనంతాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కోశాధికారి వి.బంగార్రాజు, ఆర్ఆర్ ఇంజినీరింగ్ ఎండీ శ్రీనివాస్, విటా మైనింగ్ ఎండీ విజయభాస్కర్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస : భీమిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా 11 కేవీ గ్రేహౌండ్స్ ఫీడర్‌లోని తిమ్మాపురం, గ్రేహౌండ్స్, హేచరీస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

తగరపువలస : చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దాకమర్రి ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా టి.నగరపాలెం, శింగనబంద, మజ్జివలస, లక్ష్మీపురం, నారాయణరాజుపేట పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన లారీ డ్రైవర్ చిల్ల అప్పలరాజు అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో ఉన్న అప్పలరాజు మేడ పైనుంచి కిందకు పడిపోగా తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే అతని బంధువులు చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. తన తండ్రి ప్రమాదం వెనుక ఎవరిపైనా అనుమానాలు లేవని మృతుని కుమారుడు శ్రీను భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆదర్శహిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస : భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో బుధవారం హిందీ, తెలుగు మాధ్యమాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్రపై మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిశంకరాచార్యునికి పరకాయ ప్రవేశ విద్య తెలుసన్నారు. ఆయన బోధనలు ఇప్పటికీ అనుసరణీయమన్నారు. అనంతరం 54 మంది విద్యార్థులకు మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

చంద్రంపాలెం హైస్కూల్‌లో అడ్మిషన్లు



చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



పాఠశాల ఆవరణలోని బాస్కెట్ బాల్ కోర్టు

- విద్యార్థులు రోజూ మధ్యాహ్నం సంప్రదించాలి
- అవసరమైన అన్ని పత్రాలూ తీసుకురావాలి
- 'సాక్షి' కథనానికి స్పందించిన డీఈవో చంద్రకళ

మధురవాడ : రాష్ట్రంలోనే పెద్దది, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా, వాటికి పోటీగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. పాఠశాలల రీ ఓపెనింగ్ తర్వాతే ఇక్కడ అడ్మిషన్స్ ప్రారంభిస్తామని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సోమయాజులు చెప్పడంతో... అప్పటి వరకు అడ్మిషన్స్ ప్రారంభించకపోతే ఇక్కడ చేరాలనుకునే విద్యార్థులు వేరే పాఠశాలలకు వెళ్లిపోయే అవకాశం ఉందని 'స్కూళ్ల ప్రారంభం తర్వాతే అడ్మిషన్లు' అనే శీర్షికతో సాక్షి పత్రికలో బుధవారం ప్రచురించిన కథనానికి డీఈవో చంద్రకళ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ నెలలోనే చంద్రంపాలెం హైస్కూల్‌కు సమీపంలో ఉన్న స్కూళ్ల మ్యాపింగ్, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. అప్పుడే అడ్మిషన్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. ఏది ఏమైనా ఇక్కడకు వచ్చిన పిల్లలను చేర్చుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సోమయాజులును ఆదేశించారు. దీంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

మధ్యాహ్నం పూటే అడ్మిషన్లు

పాఠశాలలో శుక్రవారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నందున పరీక్షలు పూర్తయ్యేంత వరకు మధ్యాహ్నం పూట అడ్మిషన్ల ప్రక్రియ చేపడతామని ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు తెలిపారు. ఇక్కడ చేరాలనుకునే విద్యార్థులు అంతా మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చి సంప్రదించాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు.

తీసుకురావాల్సిన పత్రాలు ఇవే

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో చేరాలనుకునే విద్యార్థులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు – 2, స్టూడెంట్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, తల్లి బ్యాంకు పాస్ బుక్ జెరాక్స్, తెలుపు రేషన్ కార్డు ఉంటే జెరాక్స్ తీసుకురావాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు తెలిపారు. అలాగే విద్యార్థి గతంలో చదివిన స్కూల్‌లో టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం కూడా తీసుకురావాలన్నారు. విద్యార్థి ఇప్పటి వరకూ చదివిన పాఠశాలలో టీసీ తీసుకునే సమయంలో... తాను చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరుతున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. అలా చేస్తే అక్కడ పాఠశాల డైస్ కోడ్ అడుగుతుందని, అప్పుడు చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ డైస్ కోడ్ : 28132800310 నమోదు చేయించాలని సూచించారు. తద్వారా సదరు విద్యార్థికి సంబంధించిన సమాచారం, పత్రాలు అన్నీ ఆన్‌లైన్‌లో బదిలీ అవుతాయన్నారు. ఇక్కడ చేరాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సోమయాజులు కోరారు.

టీసీలు జారీ మధ్యాహ్నం పూటే...

చంద్రంపాలెం హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసుకుని ఉన్నత విద్య నిమిత్తం వెళ్లే విద్యార్థులు టీసీ తీసుకోవాలనుకుంటే రోజూ మధ్యాహ్నం పూటే రావాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు కోరారు. నెలాఖరులోపు పాలిటెక్నిక్ కౌన్సెలింగ్, ట్రిపుల్ ఐటీలకు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉన్నందున టీసీలు తీసుకోవాలని కోరారు.



పాఠశాల తరగతి గదిలో డిజిటల్ బోర్డు

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం : ఓట్లు లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్లందరూ ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గురువారం సాయంత్రం ఇక్కడి తన క్యాంపు కార్యాలయం వద్ద ఓట్ల లెక్కింపు ఏజెంట్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి చూసి అధిక సంఖ్యలో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేశారన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు, కుట్రలు పన్నినా ప్రజలు భారీగా వచ్చి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ఇక్కడ తాను కూడా అత్యధిక మెజారిటీతో గెలుస్తానని, అందులో సందేహం లేదన్నారు. ముఖ్యంగా ఓట్ల లెక్కింపు సమయంలో ప్రత్యర్థులు తప్పుడు పనులు చేసే అవకాశం ఉందని, అందువల్ల అక్కడ ఉండే ప్రతీ ఏజెంట్ ఎంతో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని కోరారు. దీనిపై పత్యేక దృష్టి సారించాలని, చిన్న పొరపాటు కూడా జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎంతో శ్రద్ధగా పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా అన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జానకీరామ్

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ తెలిపారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒక రోజు జాతీయ సదస్సు ఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకో టూరిజం ఆన్ బయోడైవర్సిటీ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారం పెరగడం పెను ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రణాళికాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర జీవులపై సైతం ప్రభావం చూపుతోందన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యుడు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం, పర్యవసానాలను వివరించారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావం జీడీపీపై ప్రభావం చూపుతుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక, పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9 వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



భీమిలి ఎగువపేటలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న జయప్రద, కెజియాకుమారి

తగరపువలస : సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం – విశాఖ ఆధ్వర్యంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, వివరాల నమోదు కార్యక్రమం జూన్ 9 వరకు కొనసాగుతుందని భీమిలి ఎంఈవో – 2 జయప్రద, భవిత విద్యా వనరుల కేంద్రం శిక్షకురాలు కెజియా కుమారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం భీమిలి ఎగువపేటలో బడి బయట ఉన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక అవసరాలు గల 18 ఏళ్లలోపు చిన్నారులు, బాలబాలికలను భవిత విద్యావనరుల కేంద్రానికి పంపించాలని కోరారు. వీరిలో మానసిక వైకల్యం, మాటలు రాని పిల్లలు, చెవులు వినిపించని వారు, కళ్లు కనిపించనివారు, చలన వైకల్యం ఉన్నవారు ముందుగా దగ్గరలోని పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా రథోత్సవం



విద్యుత్ దీపాలంకరణతో రాజ్యలక్ష్మి ఆలయం



గెద్దపేటలో రథాలు ఊరేగిస్తున్న భక్తులు

పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో రాజ్యలక్ష్మి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ బళ్లను మూడు రథాలుగా తీర్చిదిద్దారు. అంజలి రథంతోపాటు మిగిలిన రెండు రథాలను గ్రామంలో ఊరేగించారు. చిడతలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు. గ్రామస్తులు ఉత్సాహంగా ఉయ్యాల ఊగారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

ప్రతీ గురువారం బీసీజీ టీకాలు



మధురవాడలో రోగులతో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రశాంతి



పీఎం పాలెంలోని సచివాయంలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మధురవాడ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యూపీహెచ్‌సీలు, అన్ని సచివాలయాల్లో మూడు నెలల పాటు టీబీ నిర్మూలనకు బీసీజీ టీకాలు వేస్తారని, అంతా సద్వినియోగం చేసుకోవాలని మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి సూచించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ ఆస్పత్రులతోపాటు అన్ని సచివాలయాల్లో కూడా వ్యాక్సిన్ వేస్తారన్నారు. గురువారం 250 మందికి వివిధ ప్రాంతాల్లో వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. గత 5 సంవత్సరాలుగా టీబీ మందులు తీసుకుని తగ్గిన వాళ్లు కూడా వేయించుకోవాలన్నారు. టీబీ రోగులతో క్లోజ్ కాంటాక్ట్ ఉన్న వ్యక్తులకు కూడా టీకాలు వేస్తామన్నారు. ముఖ్యంగా పొగ తాగే వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్) 18 కన్నా తక్కువ ఉన్నవారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

152 మందికి బీసీజీ టీకాలు

పీఎం పాలెం : క్షయ (టీబీ) వ్యాధి నివారణలో భాగంగా భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీజీ టీకాలు గురువారం 152 మందికి వేశామని స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుజాన్ పట్టా తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాల్లో ప్రతీ గురువారం టీకాలు ఉచితంగా వేస్తారన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, సుగర్ వ్యాధిగ్రస్థులు తప్పనిసరిగా టీకా వేయించుకుంటే క్షయ వాధి సోకకుండా రక్షణ కవచంలా పని చేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సచివాలయ, ఆశా సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గాదె రోశిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో జూనియర్ కళాశాల సిద్ధం

- జూన్ ఒకటి నుంచి తొలి సంవత్సరం తరగతులు ప్రారంభం
- కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల నిర్వహణ



జూనియర్ కళాశాల నిర్వహించనున్న రెడ్డిపల్లి హైస్కూల్



రెడ్డిపల్లిలో అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో హెచ్ఎం సన్యాసిరావు

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జూనియర్ కళాశాలలో జూన్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం మార్చిన విషయం తెలిసిందే. మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి గతంలో తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గంధవరం, అనంతవరం, పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి, విజయానందపురం, ఆర్.వీ.పురం, బి.ఆర్.తాళ్లవలస, పాండ్రంగి గ్రామాల్లో ఈ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి ఈ కళాశాల ఉపయోగపడుతుంది. ఇంత వరకు జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు దూర ప్రాంతాలైన విజయనగరం, భీమునిపట్నం, తగరపువలస వెళ్తున్నారు. పద్మనాభంలో గతంలో ఉండే మహారాజా జూనియర్ కళాశాలను యాజమాన్యం మూసివేసింది. ఈ నేపథ్యంలో రెడ్డిపల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లక్కరలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పద్మనాభం మండల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డిపల్లి కళాశాలలో కో – ఎడ్యుకేషన్ కొనసాగిస్తారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు మంజూరు చేశారు. గ్రూపునకు 40 సీట్లు కేటాయించారు. మొదటి సంవత్సరం తరగతులు జూన్ ఒకటి నుంచి నిర్వహణకు విద్యా శాఖ సమాయత్తమైంది. హెచ్ఎం ఎం.సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అడ్మిషన్ల కోసం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎంపీసీలో పది మంది, సీఈసీలో పది మంది చేరారు. అడ్మిషన్ల కోసం 90002 23183లో సంప్రదించాలని హెచ్ఎం ఎం.సన్యాసిరావు కోరారు.

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ

- విశేషంగా స్వామికి పంచకలశ స్నపనం
- చందనంతో దర్శనమిచ్చిన అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



చందనంతో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

సింహాచలం : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండవ విడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జాము రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషంగా పంచకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. గంగా జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

మధురవాడ జోనల్ ఆఫీసు పనులు త్వరలో పూర్తి



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద పనులు పర్యవేక్షిస్తున్న శాంతిరాజు, తదితరులు

మధురవాడ : ఈ నెలాఖరుకి జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయం పునర్నిర్మాణ, సుందరీకరణ పనులు పూర్తి చేస్తున్నట్టు జీవీఎంసీ జోన్ – 2 ఈఈ శాంతిరాజు చెప్పారు. కమిషనర్ సాయికాంత్ వర్మ తక్షణమే పనులు పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అధికారులు మరింత త్వరగా పనులు చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఈ పనులను ఇతర అధికారులతో కలిసి శాంతిరాజు గురువారం పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పనులు రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్నామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, అప్పలరెడ్డి, కొండలరావు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు రెండు కేంద్రాలు

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో 250 మంది విద్యార్థులు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని మండల విద్యశాఖ అధికారి శివరాణి గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి జూన్ 3 వరకు నిర్వహించే పరీక్షల కోసం భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలు కేటాయించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయని, సమయానికి ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

3 నుంచి కథక్ నృత్యంలో శిక్షణ

మద్దిలపాలెం : అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్ విశాఖ వేదికగా వచ్చేనెలలో 5 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నామని నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ గౌడ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు కథక్ నృత్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వర్క్‌షాపులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చివరి రోజున స్టేజ్‌పై నాట్యం చేసేలా శిక్షణ ఇస్తామన్నారు. 10 నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 98481 37445 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'చర్చి, శ్మశానవాటికకు చందాలు ఇవ్వొద్దు'

తగరపువలస : చిట్టివలసలో చర్చి భవన నిర్మాణం, శ్మశానవాటిక నిమిత్తం ఎవరూ చందాలు ఇవ్వొద్దని లండన్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ బి.ఎల్.కాంతయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ 1862లో చిట్టివలస జ్యూట్ యాజమాన్యం క్రైస్తవ ఆరాధనకు 5 సెంట్లు స్థలం, సర్వే నంబర్ 31/2లో క్రిస్టియన్ శ్మశానవాటికకు 19 సెంట్లు స్థలం కేటాయించినట్టు తెలిపారు. కాలక్రమేణా ఆ స్థలాలను జీవీఎంసీకి అప్పగించామన్నారు. ఇటీవల ఈ శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించేందుకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.25 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. మిల్లు యజమాన్యంతో చర్చికి లీజు కాలపరిమితి పూర్తవడంతో ఇటీవల చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సహకారంతో మరడపాలెం వద్ద 3 సెంట్లు స్థలం కొనుగోలు చేసి చర్చి నిర్మించుకున్నామన్నారు. జ్యూట్‌మిల్లు ఆస్తులను వారికి వదిలేసినట్లేనన్నారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వదిలేసిన ఆస్తులను ఇప్పటికీ సుంకర కృపారావు, అతని కుటుంబ సభ్యులు స్వాధీనం చేసుకుని వారి ఆస్తులుగా ఇతరులను నమ్మిస్తున్నారన్నారు. శ్మశానవాటికలో సమాధి చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా దృష్టికి తీసుకురాగా కృపారావు, అతని కుటుంబ సభ్యులకు చర్చి, శ్మశానవాటికలపై ఎలాంటి హక్కులు లేవన్నారని తెలిపారు. వారికి చర్చి ఆఫ్ సౌత్ ఇండియాతో ఎలాంటి సంబంధం లేదని బిషప్ డాక్టర్ టి.జార్జ్ కర్నేలియస్ స్పష్టం చేశారన్నారు. వారు నిర్మించే చర్చి భవనాలకు, శ్మశానవాటికలకు ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన కూడా స్పష్టం చేశారని తెలిపారు.